
డ్రైవర్లకు అండగా ..



- నియోజకవర్గంలో 3,646 మందికి 'వాహనమిత్ర' లబ్ధి
- ఐదు విడతల్లో రూ.21.24 కోట్ల జమ



లబ్ధిదారులకు ఐదో ఏడాది వాహనమిత్ర చెక్కు అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున తదితరులు (ఫైల్)

గాజువాక: ప్రతిపక్ష నేతగా నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి డ్రైవర్లు కూడా తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. వారి కష్టాలను విన్న నాటి ప్రతిపక్ష నేత నేనున్నానని మాటిచ్చారు. అధికారంలోకి రాగానే వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్‌లను నడుపుకొంటూ జీవనం సాగిస్తున్న ప్రతి డ్రైవర్‌కు అకౌంట్‌లో ఏటా రూ.10వేలను జమ చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని పథకాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు.

సొంత వాహనంలో ఉపాధి పొందుతున్న డ్రైవర్లు, ఎండీయూ ఆపరేటర్లకు బాసటగా నిలిచారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నాయకుల సిఫార్సులు అవసరం లేకుండా అర్హతే ప్రమాణికంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వం ఏ పథకం అమలు చేయాలన్నా జన్మభూమి కమిటీల పేరుతో దందాలు సాగించిన విషయం తెలిసిందే. అలాంటి విధానానికి స్వస్తి పలికిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేసింది. గాజువాక నియోజకవర్గంలో ఈ పథకం కింద ప్రతి ఏటా 3వేల మందికిపైగా డ్రైవర్లు లబ్ధి పొందుతున్నారు. మొత్తం ఐదు విడతల్లోను డ్రైవర్ల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ.21,24,18,170 నగదును జమ చేశారు. ఈ పథకానికి లబ్ధిదారుల ఎంపిక కూడా అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. పథకానికి అందిన దరఖాస్తులను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పరిశీలించి అర్హత ఆధారంగా అమలు చేసిన విషయం తెలిసిందే.



గాజువాక ఆటోస్టాండ్

వైఎస్సార్ వాహన మిత్ర లబ్ధి..

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు
2019-20	2965	3,90,32,370
2020-21	3161	4,09,97,470
2021-22	3303	4,32,23,060
2022-23	3468	4,34,65,270
2023-24	3646	4,57,00,000
ఐదు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ		21,24,18,170

వాహన మిత్ర వరం



నేను వాహన మిత్ర పథకం ద్వారా లబ్ధి పొందాను. ఈ పథకం జగనన్న మాకు ఇచ్చిన వరం. ప్రతీ సంవత్సరం మాకు రూ.10వేలు నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో పడుతోంది. దీనివల్ల నాలాంటి ఎంతోమంది డ్రైవర్లకు మేలు జరుగుతోంది.

–ఉరుకూటి ప్రసాద్, గాజువాక

కరోనా సమయంలో పథకం ఆదుకుంది



వాహన మిత్ర పథకం అమల్లోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు నాకు ఐదు విడతల్లో నగదు జమ అయ్యింది. కరోనా సమయంలో ఈ పథకం ద్వారా నాకు డబ్బులు జమ కావడంవల్ల చాలా ఊరట చెందాను. ఆ సమయంలో డబ్బుల్లేక విలవిల్లాడిపోయాను. జగనన్న దయవల్ల ప్రతి సంవత్సరం రూ.10వేలు జమ అవుతోంది.

– కె.వి.శ్రీనివాసరావు, కూర్మన్నపాలెం

అన్ని రకాలుగా ఉపయోగం



వాహనమిత్ర పథకం ద్వారా జమ అవుతున్న నగదు నాకు అన్ని రకాలుగా ఉపయోగపడుతోంది. ఇన్సూరెన్స్ కట్టుకోవడంతో పాటు ఆటో నిర్వహణకు ఈ డబ్బులు బాగా ఉపయోగపడుతున్నాయి. నాలుగు విడతలుగా నాకు వాహన మిత్ర డబ్బులు జమ అయ్యాయి. ఇలాంటి పథకం గతంలో ఎప్పుడూ చూడలేదు.

– కె.చిన్నారావు, కూర్మన్నపాలెం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



లంకెలపాలెం కాలనీలో శంకుస్థాపన చేస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలులో పలువురి ప్రశంసలందుకున్న ఘనత మన సీఎంకు దక్కిందన్నారు. జీవీఎంసీ 68వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.49.20 లక్షలతో మింది ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు, సీసీ కాలువలు, షీలానగర్ వద్ద గల సర్వీసు రోడ్డు అభివృద్ధి, అక్కిరెడ్డిపాలెం నుంచి పాత గాజువాక సర్వీసు రోడ్డు ప్యాచ్ వర్క్ పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్‌ల సహకారంతో వార్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, రెడ్డిపల్లి చిట్టిబాబు, ఈటి సురేష్, జీలకర్ర నాగేంద్ర, బి.శశిభూషణరావు, నేలపాటి సత్యవతి, శ్రీనివాస రెడ్డి, సయ్యద్ హుస్సేన్, పి.రాజు, కోటేశ్వరరావు, జీవీఎంసీ ఏఈ ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం కాలనీలో 1.5 కోట్లతో పనులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం పరిసర కాలనీల్లో, దేశపాత్రునిపాలెం పరిసర గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.కోటిన్నరతో లంకెలపాలెం ఆర్‌కే టౌన్‌షిప్, విరోతి దొడ్డి, గెంజిపేట, బీసీ కాలనీ, కర్రివీధి, దేశపాత్రునిపాలెం శేషాద్రినగర్, సాయినగర్ కాలనీ, ఎస్‌డబ్ల్యూకె కాలనీల్లో పోలమాంబ ఆలయం సమీపంలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. నిర్మాణ పనులు తక్షణం ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ), పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, నాయకులు కాసు అంజిరెడ్డి, సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



67వ వార్డులో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

67వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 67వ వార్డు గణేష్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. 67వ వార్డు మహిళా అధ్యక్షురాలు పల్లా చినతల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, పల్లా పెంటారావు, బొడ్డేడ అచ్చియ్యనాయుడు, లక్ష్మి, కారు నాయుడు, షాహిద్, అమ్మాజీ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

అగనంపూడి: విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా విద్యాబోధన సాగించాలని సొల్యూషన్స్ టీమ్ టాలెంట్ మెట్రిక్స్ ప్రతినిధి సుప్రితా సింఘా అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన అధ్యాపకుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధ్యాపకులు నిరంతర విద్యార్థిగా వ్యవహరిస్తూ బోధనలో మెలకువలు, ఆలోచనలను అందిపుచ్చుకుని బోధన సాగిస్తే ఆదర్శ అధ్యాపకునిగా పేరు తెచ్చుకుంటారన్నారు. కార్యక్రమంలో సోనీ, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: మాతృశ్రీ కళానికేతన్ ఆధ్వర్యంలో నటుడు, దర్శకుడు, రచయిత, నంది అవార్డు గ్రహీత వి.సంగమేశ్వరరావు జయంతిని నడుపూరు ఉక్కు కళావేదికలో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు థింసా నృత్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. రావి నాగేశ్వరరావు రచించి, పి.ఎస్.వి. సత్యనారాయణ (జబర్దస్త్ సత్తిపండు) దర్శకత్వం వహించిన 'చూపులు కలవని శుభవేళ' హాస్య నాటికను ప్రదర్శించి కడుపుబ్బా నవ్వించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బెల్లాల నాగేశ్వరరావు, బొడ్డు కృష్ణారావు, మంత్రి శంకరనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి ముఖద్వారం వద్ద మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ఎనిమిది నెలలుగా ఏ నెలా సమయానికి జీతాలు చెల్లించలేదన్నారు. డిసెంబర్ నెల జీతం ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ జీతాలు ఎగ్గొట్టడంతో యాజమాన్యం రెండు, మూడు నెలలకు ఒకసారి జీతాలు చెల్లిస్తోందని చెప్పారు. తక్షణమే జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం విభాగం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వి.వి.రమణ, ఎం.నర్సింగరావు, వై.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐజీబీసీ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



స్టూడెంట్ చాప్టర్ ప్రారంభిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) స్టూడెంట్ చాప్టర్‌ని మంగళవారం ప్రారంభించారు. ఆరో హరిత్ ప్రేమ్ భారత్ మహోత్సవ్ 2024లో భాగంగా 369వ విద్యార్థి శాఖను ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేశారు. గ్రీన్ బిల్డింగ్‌లపై యువతకు అవగాహన కల్పిస్తూ, వీటికి సంబంధించిన సమాచారాన్ని ఈ శాఖ అందిస్తుంది. ఐజీబీసీ విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం చైర్మన్ లీలా ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ.. స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ధ్రువ పత్రాలను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.ఇ.సత్యనారాయణ రెడ్డి, ఐజీబీసీ సీనియర్ కౌన్సెలర్ శ్రీరేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాముల వారి తీర్థం



ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు



అయోధ్య బాలరాముని చిత్రపటాలను భక్తులకు అందిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ డొంకాడలో రాములవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి భక్తులు సీతారాములను దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ అయోధ్య బాలరాముని చిత్ర పటాలను, ప్రసాదాన్ని అందజేసింది. సాయంత్రం సీతారాముల ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జై శ్రీరామ్, శ్రీరామ.. జయ రామ.. జయ జయ రామ అంటూ భక్తులు జగదభిరాముని స్మరించారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు దాసరి త్రినాథ్, బొబ్బరి అప్పారావు, దాసరి సన్యాసిరావు, బల్ల సత్తిబాబు, దాసరి నాయుడు, కరణం పెంటారావు, సీహెచ్.దుర్గారావు, డి.శ్రీను, ఐ.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఐఎన్‌టీయూసీ గుర్తింపులో ఉన్నప్పుడే కార్మికులకు ఆర్థికపరమైన ప్రయోజనాలు కలిగాయని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ హయాంలో కార్మికులకు అధికారులుగా పదోన్నతి కల్పించేలా ఒప్పందం చేశామన్నారు. ఈ సందర్భంగా విభాగం నూతన కమిటీని నియమించారు. కన్వీనర్‌గా టి.ఎల్.ఎన్.రాజు, అధ్యక్షునిగా ఎం.ఆర్. నాగేశ్వరరావు, కార్యదర్శిగా వి.రంగారావు తదితరులతో కూడిన 25 మందిని నియమించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, వై.వి.రమణ, గంట్యాడ పైడిరాజు, ఎస్.ఎ.నాయుడు, మొల్లి ఈశ్వరరావు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: గాజువాక మండల పరిధిలో ప్రజలకు న్యాయ పరమైన సలహాలతో పాటు తగు న్యాయ సహాయం అందించాలన్న ఆలోచన ఉన్న ఔత్సాహికుల నుంచి పారా లీగల్ వలంటీర్లు(న్యాయ సహాయకులు) గా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గాజువాక మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి.షణ్ముఖరావు ప్రకటనలో తెలిపారు. వీరికి శిక్షణ ఇస్తామని, ఏడాది పాటు సేవలు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీరికి ఎటువంటి పారితోషికం చెల్లించబోమన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోగా ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత పత్రాలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఇతర సంబంధిత పత్రాలను గాజువాక కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కనీస విద్యార్హత పదో తరగతి అని, వివిధ సేవా సంస్థలలో పని చేస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఉక్కునగరం నెహ్రూ పార్కులో జరిగిన వార్షిక సాధారణ సమావేశంలో గతేడాది సాధించిన ప్రగతి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా 2023–26 కు గాను నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చీఫ్ అడ్వైజర్‌గా ఎస్.వీరేశం, గౌరవాధ్యక్షునిగా ఎం.కె.వి.ఆర్. మోహన్‌రావు, అధ్యక్షునిగా ఎస్.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా జి.ఆనంద్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా టి.ప్రభాకర్, ఎం. గోపాల్, సీహెచ్.రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా తాండ్ర కనకరాజు, కోశాధికారిగా ఎన్.నర్సింగరావు, సంయుక్త కోశాధికారిగా తిరుపతి నాయక్‌తో పాటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



సంఘం నూతన కార్యవర్గం

బావుల్లో లార్వా నిర్మూలనకు చర్యలు

పెదగంట్యాడ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని లేదంటే దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్ అన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు బావుల్లో దోమల లార్వా నిర్మూలనకు చర్యలు చేపట్టామని చెప్పారు. జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలసి డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. తాగిపడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. రోడ్లపై, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దన్నారు. రోజూ ఇళ్ల వద్దకు వచ్చే శానిటరీ సిబ్బందికి చెత్తను అందజేయాలని కోరారు. అనంతరం బావుల్లో గంబూసియా చేపలను విడిచిపెట్టారు.



బావుల్లో గంబూసియా చేపలను విడిచిపెడుతున్న ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్

చిత్తడి నేలల పరిరక్షణపై అవగాహన కల్పించాలి

అగనంపూడి: చిత్తడి నేలల పరిరక్షణలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాల స్థాయిలో ర్యాలీలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని ఏపీఎస్‌జీసీ అనకాపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు కోరారు. ప్రతీ పాఠశాలలో ఎకో క్లబ్‌ల ద్వారా వీటిని నిర్వహించాలన్నారు. లంకెలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖల ద్వారా ఈ ఏడాది చిత్తడి నేలల పరిరక్షణ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు ఎకో క్లబ్‌ల ద్వారా పాఠశాల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉన్నా.. సంక్రాంతి సెలవులు, ఎఫ్‌ఏ–3 పరీక్షల వల్ల సాధ్యం కాలేదన్నారు. 24వ తేదీన పరీక్షలు లేనందున పాఠశాల స్థాయిలో ఎకో క్లబ్‌ల ద్వారా ర్యాలీ నిర్వహించాలని కోరారు. జిల్లా స్థాయిలో కొండకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కో–ఆర్డినేటర్లు పాల్గొనాలని కోరారు.

యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్

జయంతి వేళ నేతాజీకి ఘన నివాళులు



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహాత్మాగాంధీ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: దేశ స్వాతంత్ర్యం కోసం 'ఆజాద్ హింద్ ఫౌజ్' సంస్థను స్థాపించి, సైనికులకు శిక్షణ ఇచ్చి బ్రిటీష్ వారిపై యుద్ధాన్ని ప్రకటించిన ధీశాలి నేతాజీ అని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత దేశానికి సేవ చేయాలని సూచించారు. 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు, ధీశాలి నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చిత్రా రామారావు, ప్రతినిధులు విందుల నారాయణరావు, ముత్యాల అప్పారావు, కరణం శ్రీను, సతీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

ఎక్స్‌సర్వీస్‌మెన్ ఆధ్వర్యంలో..

దేశ స్వాతంత్ర్య సముపార్జనకు సాయుధ దళంతో పోరాడిన యోధుడు నేతాజీ అని పైడిమాంబ ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు విందుల శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు పెదమడకలో నిర్వహించిన పరాక్రమ దివస్ కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, ఎర్ని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి స్ఫూర్తి ర్యాలీ

పెదగంట్యాడ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని శ్రీచైతన్య, నారాయణ కళాశాలల విద్యార్థులు మంగళవారం విద్యార్థి స్ఫూర్తి ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేతాజీ నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో నితిన్, పేర్ల సత్యారావు, రాకేష్, చిన్న నితిన్, వెంకటేష్, సిద్ధు, అవినాష్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అన్యాయం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దీనిపై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1076వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎస్ఎంఎస్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం పోరాడుతున్నా ప్రధాని నరేంద్రమోదీ ఈ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



1076వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో అత్తా కోడళ్లకు గాయాలు

గోపాలపట్నం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అత్తా కోడళ్లను ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు... చంద్రనగర్‌కు చెందిన అత్తాకోడళ్లు రాజేశ్వరి, రామలక్ష్మి ద్విచక్ర వాహనంపై గురుద్వార నుంచి చంద్రనగర్ వెళ్తున్నారు. ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద వెనుక నుంచి వస్తున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఆటోలో క్షతగాత్రులను సమీప ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు మరో కారును ఢీకొట్టింది. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం, రెండు కార్లు దెబ్బతిన్నాయి.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు



తాము వేసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

సింధియా: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా నౌసేనాబాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం–1లో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మొత్తం 11 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హెచ్ఎం సుధీర్‌కుమార్, డ్రాయింగ్ టీచర్ సుసేంద్రరావు పోటీలను పర్యవేక్షించారు. న్యాయనిర్ణేతలుగా ఏయూ ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ముగ్గురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురిని ఎంపిక చేశారు.

విజేతలు వీరే.. : అతిథిగుప్తా (ఎన్‌సీఎస్ స్కూల్), గణేష్‌చందు (కేవీ మల్కాపురం), ప్రియాంకబాయ్ (కేవీ–1 నౌసేనాబాగ్), మనీష్ (కేవీ స్టీల్ ప్లాంట్), శ్రీచరణ్ (విజ్ఞాన్ ప్రతిభ ఉన్నత పాఠశాల) విద్యార్థులు ప్రతిభ చూపారు. న్యాయనిర్ణేతల చేతులమీదుగా బహుమతులు అందజేశారు.